వెలుగుల విద్యాలయం


బల్లికుర ప్రభుత్వ జనరల్ కళాశాల


కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

- ఇంటర్ ఫలితాల్లో బల్లికురవ కళాశాల హవా
- రెండో సంవత్సరం నూరు శాతం ఫలితాలు
- కళాశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

బల్లికురవ:

ఇంటి భోజనంతో ఒత్తిడి లేని విద్య అందిస్తూ బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపుతో పొందుతోంది. అత్యుత్తమ ఫలితాలతో విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా ఇస్తోంది. 2001మే 24న బల్లికురవకు జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. కళాశాల అభివృద్ధి కమిటీ కృషితో బల్లికురవ నుంచి అద్దంకి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు తూర్పు భాగంలో సుమారు 11 ఎకరాల స్థలాన్ని దాతల నుంచి సేకరించారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో నాబార్డ్, ఉపాధి హామీ నిధులు, నాడు- నేడుతో కళాశాలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూరాయి. తూర్పు, పడమర ఉత్తర భాగాల్లో ప్రహరీ నిర్మాణం చేపడితే ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చు.

కార్పొరేట్ కళాశాలకు దీటుగా..

ప్రస్తుతం కార్పొరేట్, ప్రైవేట్ కళాశాల దీటుగా సీఈసీ, ఎంపీసీ, బైపీసీ విభాగాలకు గాను తెలుగు, ఇంగ్లిష్ మీడియం మీడియంలో విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో జరిగిన ఇంటర్ రెండో సంవత్సరంలో మూడు గ్రూపుల్లో 35 మంది పరీక్షలకు హాజరు కాగా అంతా పాసై అత్యధిక మార్కులు కైవసం చేసుకున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూప్ నుంచి రాజస్థాన్‌కు చెందిన రాజ పురోహిత సరిత 912 మార్కులు, బైపీసీ నుంచి కరుణ 825 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 73 శాతం ఫలితాలతో ఎంపీసీ నుంచి ఎస్.కె మునీర్ 470 కి430.. బైపీసీ నుంచి ఎం. కుమారి 440కి 406 మార్కులు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ కె. సుధాకర్ తెలిపారు.

స్వీయ పర్యవేక్షణ

కళాశాలలో ప్రిన్సిపాల్ 11 మంది అధ్యాపకులు ముగ్గురు నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తూ విద్యాభివృద్ధికి చేయూతనిస్తున్నారు. పేద విద్యార్థులకు అవసరమైన ఫీజులు క్లాసులవారీగా అత్యధిక మార్పులు కైవసం చేసుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఇప్పటికే మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలలో చేరేందుకు మిషన్ ప్రక్రియ ప్రారంభమైంది. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, చెన్నుపల్లి, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడపూడి, వల్లాపల్లి గ్రామంలో ఇప్పటికే రెండు పర్యాయాలు క్యాంపెయిన్లు చేశారు. కళాశాలలో అందుతున్న సేవలు, ఫలితాలను వివరించి తమ బిడ్డలను చేర్పించి కళాశాల బలోపేతానికి చేయూతనివ్వాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులు వివరించారు.


ప్రిన్సిపాల్, అధ్యాపకుల క్యాంపెయిన్

ఎంపీ ఫౌండేషన్ సౌజన్యంతో కంప్యూటర్ ల్యాబ్

కంప్యూటర్ విద్యకు రోజురోజుకూ ప్రాధాన్యత పెరుగుతున్నందున గత విద్యా సంవత్సరంలో ఎంపీ ఫౌండేషన్ నిర్వాహకులు రూ. 4.5 లక్షలతో 10 కంప్యూటర్లు.. అవసరమైన ఫర్నిచర్‌తో ల్యాబ్‌ను అందంగా తీర్చిదిద్దారు. దీంతో కళాశాలలోని ప్రతి విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి కంప్యూటర్ విద్యలో పట్టు సాధించే అవకాశం దొరికింది. ఆగస్టు నుంచి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్ లతోపాటు విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణతో తీర్చిదిదుతున్నారు.

ఒత్తిడి లేని విద్య అందించారు



బతుకుదెరువుకు మూడున్నర దశాబ్దాల క్రితం మా తల్లిదండ్రులు రాజస్థాన్ నుంచి ఇక్కడకు వలస వచ్చారు. నేను మా అక్కలంతా చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల ఇక్కడ కళాశాలలోనే చదివాం. ఒత్తిడి లేని విద్యను అందించటం వలన 912 మార్కులను సాధించగలిగాను. ఇంటి భోజనంతో ఎలాంటి ఖర్చులు లేకుండా ఇంతవరకు చదివాను.

రాజ పురోహిత సరిత,
విద్యార్థిని

అధ్యాపకుల పర్యవేక్షణ బాగుంది



కళాశాలలో అధ్యాపకుల పర్యవేక్షణ బాగుంది. కళాశాలకు గైర్హాజరైన వెంటనే ప్రిన్సిపాల్, అధ్యాపకులు.. మా తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. పేరెంట్స్ సమావేశంతో ప్రోగ్రెస్ తెలియజేయడం వల్లనేను 470కి 430 మార్కులు సాధించగలిగాను. ఇక్కడ విద్యాబోధన చాలా బాగుంది. మౌలిక వసతులు, కంప్యూటర్ విద్య, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ బాగున్నాయి.

ఎస్‌కే మునీర్

కళాశాల బలోపేతానికి బిడ్డలను చేర్పించండి



కళాశాల పల్లె వాతావరణంలో ఉంది. అన్ని రకాల వసతులుబాగున్నాయి. ఇంటర్ బోర్డుగత విద్యా సంవత్సరం నుంచే ఈ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేసింది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యతో నూరు శాతం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న కళాశాల బలోపేతానికిచేయూత పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు చేయూతనివ్వాలి.

కె. సుధాకర్,
ప్రిన్సిపాల్

క్లుప్తంగా

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్ నాగరాజును సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ విజయమ్మ

కారంచేడు: తహసీల్దార్ జి.నాగరాజును బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. విజయమ్మ గురువారం సత్కరించారు. గతంలో తహసీల్దారు నాగరాజు.. బాపట్ల కలెక్టర్ సీసీగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో బాపట్లలో ఆయన విధుల పట్ల నిబద్ధతతో పని చేశారని డీఎంహెచ్ఓ విజయమ్మ గుర్తు చేశారు. శాలువాతో సత్కరించి, బుద్ధుని విగ్రహం బహూకరించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం


కొప్పరపాడులో సూచనలిస్తున్న సూపర్‌వైజర్

బల్లికురవ: తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పోషణ పక్వాడ కార్యక్రమాన్నా చేపట్టిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయనిర్మల సలోమి, మీరాభీ అన్నారు. గురువారం కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు కొణిదెన గ్రామాల్లో సమావేశాన్ని నిర్వహించారు. తల్లి పాల ఆవశ్యకత గుర్తించి.. బిడ్డకు తల్లిపాలు పట్టించాలని.. డబ్బా పాలకు చెక్ పెట్టాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


సహజ వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

జె.పంగులూరు: సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రామకూరులో మనం శ్రీనివాసరాలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసి వంగ పంట పరిశీలించారు. పంటలకు వాడుతున్న కషాయాన్ని గురించి తెలుసుకున్నారు.

పర్మిట్ లేకుండా సామగ్రి తరలిస్తే చర్యలు

బల్లికురవ: గ్రానైట్ మీటరు, ముడిరాళ్లు, శ్లాబులు పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తే కేసు నమోదుతో పాటు పెనాల్టీలు విధిస్తామని మైనింగ్ ఈడీ రామచంద్ర హెచ్చరించారు. గురువారం బల్లికురవ, సంతమాగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డులోని మల్లాయపాలెం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ శ్లాబుల లారీని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ

అద్దంకి: ఏ మంటలను ఎలా అర్పాలో తెలుసుకుని ఉంటే అగ్నిప్రమదాల సమయంలో మంటలను అదుపులోకి తేవచ్చని అగినమాపక కేంద్ర అధికారి జి. వెంకటరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆయన పట్టణంలో ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రమాదాలపై విద్యార్థినిలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మంటల రాకాలను వివరించి, ఆయా మంటలను ఎలా ఆర్పాలో ప్రయోగపూర్వకరంగా చూపారు. సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సరైన జాగ్రత్తలు పాటించడం వలన అగ్నిప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి రామకృష్ణ అన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని వెంటనే నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కారు, బైకు ఢీ.. ఇరువురికి గాయాలు

అద్దంకి రూరల్: ఎదురెదురుగా వస్తున్న కారు బైకు ఢీకొన్నాయి ఈ ఘటన గురువారం రాత్రి మండలంలోని శింగరకొండ వద్ద చోటు చేసుకుంది. చక్రాయపాలెం గ్రామానికి చెందిన గుమ్మడి వెంకట వీర రామాంజనేయులు బైకుపై శింగరకొండ మీదుగా గ్రామానికి వెళుతున్నాడు. క్రమంలో శింగరకొండ చెరువు మలుపువద్దకు రాగానే ఎదరుగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళుతున్న కారు ఎదురుగా రావటంతో కారును ఢీకొట్టాడు. రామాంజనేయులుకు.. కారులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలైన రామాంజనేయులును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

వక్ఫ్ బిల్లు రద్దు చేసేవరకు పోరాటం

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సరణ చట్టం 2005ను వ్యతిరేకిస్తున్నామని ఈ బిల్లు రద్దు అయ్యేవరకు తమ పోరాటం ఆగదని ఎంపీపీఅయ్యా రాష్ట్ర నాయకుడు రెడ్‌బాషా హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండలంలోని వల్లాపల్లి గ్రామంలో బిల్లు రద్దు కోరుతూ ముస్లింలు శాంతి నిరసన ర్యాలీ చేపట్టారు. నెల రోజులుగా ఆందోళనతో నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని రెడ్ బాషా అన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు కలిసి మెలసి ఐక్యంగా జీవిస్తుంటే కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. మసీదులు, మదర్సాల ద్వారా వస్తున్న ఆదాయంతోనే సేవా సంస్థలు నడుస్తున్నాయని ఇలాంటి ఆదాయాలను కూడా దక్కకుండా చేసేందుకే ప్రభుత్వం కుట్ర పన్నుతోందని.. వక్ఫ్ బిల్లు రద్దు అయ్యేవరకు పోరాడతామన్నారు. ఇమామ్‌లు షేక్ అబ్దుల్లా, షేక్ అల్లావుద్దీన్ మాట్లాడారు.


వల్లాపల్లిలో నిరసన ర్యాలీ

పచ్చిరొట్టతో భూసారం పెంపు



రైతులకు పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్న ఏడీఏ మోహన్‌రావు

యద్దనపూడి: భూసారం పెంపునకు దోహదపడే పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని రైతులు అవలంబించేలా ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని పర్చూరు ఏడీఏ మోహన్‌రావు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బందికి, వెలుగు కార్యాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మోహన్‌రావు మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలనే తపనతో రైతులు విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని తద్వారా భూమి నిస్సారమవటమే కాక భవిష్యత్‌లో పంటలు పండే పరిస్థితులు ఉండవన్నారు. ఆదర్శ రైతులు బత్తుల మోహన్‌రావు, ఉదయ్‌భాస్కర్‌ను ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది తరఫున సత్కరించారు. ఎన్ఎఫ్ఏ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి మేరమ్మ, ఏపీఎం వెంకట్రావు, ఎంటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు


మార్టూరు: ప్రజలతో నిత్యం మమేకమై ఉండే శాఖల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రజలకు చేరువ చేస్తే అభివృద్ధిని సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ, కేవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయం.. వెలుగు సిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రజలకు చేరువ చేయటం వలన రసాయన రహిత పంటలతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడి జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం జె. మోహన్, నాచురల్ ఫార్మింగ్ ప్రతినిధులు జానకి, చందన దుర్గ, ఏటీఎం బి. సురేంద్ర, మండల మోడల్ టీం లీడర్ రాజశేఖర్, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆదర్శ రైతులు వై. రామచంద్రరావు బి. రామాంజనేయులను.. అధికారులు సిబ్బంది ఘనంగా సత్కరించి సన్మానించారు. మాస్టర్ ట్రైనర్ శివశంకర్, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

జె.పంగులూరు: వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయకూడదని.. బాల్య వివాహాలు నేరమని పంగులూరు మండల ఎంపీడీఓ కె. స్వరూపరాణి అన్నారు. పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 పై అవగాహన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం కొప్పోలు రమాదేవి, పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశ పరీక్షపై అవగాహన


హాల్‌టిక్కెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ జె.సరళ

చీరాల అర్బన్: చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండు రోజుల అవగాహన తరగతులు నిర్వహించి హాల్‌టిక్కెట్లు అందించినట్లు ప్రిన్సిపాల్ జె.సరళ గురువారం తెలిపారు. ఈనెల 21న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నాం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 8గంటలకు ప్రవేశ పరీక్ష కేంద్రానికి రావాలనిలన్నారు.

పర్చూరులో చలివేంద్రాలు ప్రారంభం


పర్చూరులో చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ అంజమ్మ

పర్చూరు (చినగంజం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బొమ్మల సెంటర్, వై. జంక్షన్లలో ఉచిత మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ మల్లా అంజమ్మ వీటిని లాంఛనంగా ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. కోమటి ఆంజనేయులు, కొల్లా శివ రామకృష్ణ, ప్రసాద్, కోట హరిప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి


ఇడుపులపాడులో రాధాకృష్ణన్ వర్ధంతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 50వ వర్ధంతిని విద్యార్థులు ఘనంగా నిర్వహించినారు. ఇడుపులపాడులోని విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది


కొండమంజులూరు పాఠశాలకు అందించిన వస్తువులు

జె.పంగులూరు: పాఠశాలకు అవసరమైన వస్తువులను అందిస్తున్న దాతల సహకారం మరువలేనిదని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, కోటపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుఅన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, కోటపాడు ఉన్నత పాఠశాలకు గురువారం రూ. 2.50 లక్షల విలువ చేసే వస్తువులను పాఠశాలు అందించారు. ఈ వస్తువులను ఆంధ్రప్రదేశ్ గ్రానైట్స్ మిడ్ వెస్ట్ లిమిటెడ్ చీమకుర్తి వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో భాగంగా అందించారు. కొండమంజులూరు పాఠశాలకు రూ. 1.50 లక్షల విలువ గల ప్రింటర్, సీపీయూ, 25 కుర్చీలు, 8 సీలింగ్ ఫ్యాన్లు, 2 ర్యాకులు అందజేశారు. కోటపాడు పాఠశాలకు రూ. 1 లక్ష విలువ గల బీరువాలు 3, డిస్క్ టాప్ 1, 3 కుర్చీలు, టెబుల్ 1, ఆఫీస్ టెబుల్ 2 అందిచారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సహదేవుడు, దాత బొప్పూడి నాగేశ్వరరావు, రావుల వెంకన్న, రావుల సురేష్, సంపాని హరిబాబు, బొప్పూడి లక్ష్మీ నారాయణ, గుంటుపల్లి జనార్దనరావు, గడ్డం నాగేశ్వరరావు, పేర్ని వీరనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ బుల్లిబాబు పాల్గొన్నారు.

కార్యాలయంలోకి వెళ్లేదెలా సారూ..?

- ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా కార్ పార్కింగ్
- తీరుమార్చుకోని మండల పరిషత్ కార్యాలయం అధికారులు, ఉద్యోగులు


మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే వీలులేకుండా కారును పార్కింగ్ చేసిన దృశ్యం

చీరాల టౌన్: అది చీరాల మండల పరిషత్ కార్యాలయం. నిత్యం వందలాది మంది మండలంలోని గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రభుత్వ కార్యాలయం. కానీ ప్రస్తుతం ఆ కార్యాలయంలోకి వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కారణం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి తన కారును దర్జాగా కార్యాలయం మెట్ల ముందు పార్కింగ్ చేయడమే. దీంతో కార్యాలయంలో వెళ్లేందుకు మెట్లు ఎక్కే వీలులేకపోవడంతో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపుపై వెళ్తున్నారు. చీరాల ఎంపీడీవో కార్యాలంలో మండల పరిషత్ ఉద్యోగులతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం విభాగం, డివిజినల్ పంచాయతీల అభివృద్ధి అధికారి కార్యాలయం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి తన కారును మాత్రం కార్యాలయంలోకి వెళ్లే మెట్ల ముందు దర్జాగా నిలుపుదల చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం


రీ సర్వే వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్

యద్దనపూడి: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు కాకి రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పూనూరులో జరిగిన రీ సర్వేకు సంబంధించి సిబ్బంది గుర్తించిన భూ వివరాలను పరిశీలించారు. ల్యాండ్ వ్యాలిడేషన్‌తో పాటు జారీ చేసిన 9-2 నోటీసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే డీటీ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో వసంతరావు, ఆయా గ్రామాల విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.


బల్లికురవ: రీసర్వేపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రీసర్వే వేగవంతం చేయండి

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి, కొప్పరపాలెం, గొర్రెపాడు, గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సర్వేలో భాగంగా భూముల లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి అర్హులకు పట్టాలిచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రీసర్వే టీడీ ప్రహర్ష, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పాల్గొని మాట్లాడారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించండి

చీరాల టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. గురువారం పట్టణంలోని చీరాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు అధ్యక్షతన నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయడంతో పాటు నియోజకవర్గంలో ప్రతి నెలా మూడో శనివారం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధిస్తామన్నారు. శాఖల మధ్య పూర్తి సహకారంతో చీరాల నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజయవంతం చేయాలన్నారు. శనివారం రామాపురంలో జరిగే కార్యక్రమానికి అంతా హాజరు కావాలని కోరారు. అలానే నియోజకవర్గం అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో తహసీల్దార్లు కె.గోపికృష్ణ, పి.పార్వతి, చీరాల డీఎస్పీ మొయిన్, ఎంపీడీఓ రాజేష్, ఈవోఆర్డీలు, పలుశాఖల మండల, డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో సూచనలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మార్టూరు: గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ అకాల వర్షంతో నష్టపోయిన రైతుల పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని మార్టూరు మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించి.. రైతుల దుస్థితి గురించి వివరించారు. వర్షం వలన మామిడి, మిర్చి, మొక్కజొన్న, బర్లీ పొగాకు రైతులు తీవ్రంగా నష్ట పోయినట్లు తెలిపారు. మొక్కజొన్న పంట క్వింటాలకు 2700 రూపాయలు, మిర్చి క్వింటాలుకు 20 వేల రూపాయలు, బర్లీ పొగాకు క్వింటాకు 15 వేల రూపాయలు చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులు నష్టాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మార్టూరు మండల శాఖ కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా నాయకుడు బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, బి. సూరిబాబు, శేషగిరి పాల్గొన్నారు.


ఏడీఏ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆకలి పరీక్షపై అవగాహన...

పర్చూరు (చినగంజం): చిన్నారుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు అవసరమైన ఆకలి పరీక్షపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ సుభద్ర పరీక్షను నిర్వహించే విధానాన్ని వివరించారు. చిన్నారులకు రెండు గంటల పాటు ఎలాంటి ఆహారాన్ని ఇవ్వకుండా రెండు గంటల తర్వాత ఆహారాన్ని అందించాలన్నారు. అప్పుడు పిల్లలు ఆహారాన్ని తినే క్రమాన్ని పరిశీలించి ఎవరైతే ఆహారాన్ని గబగబా తింటారో వారిలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని గుర్తించాలని తెలిపారు. ఆహారాన్ని అయిష్టంగా, చిన్నగా తినే పిల్లల్లో అనారోగ్య సమస్యలు ఉన్నాయని గుర్తించి వారికి పౌష్టికాహారం, మందులను అందించాలని ఆమె తెలిపారు. హెడ్ మాస్టర్ కేడీవీ ప్రసాద్, సూపర్వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పర్చూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం